విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 05, జూలై 2024

ఉద్యానవన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు సన్న, చిన్న కారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తూ ఉందని ఉద్యానవన శాఖ అధికారిని ధరణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో రైతు ప్రసాద్ సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్స్ పండ్ల తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు నిర్వహణ కింద మూడు సంవత్సరాల పాటు వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సేవా కేంద్రం తనఖీ

విశాలాంధ్ర -అవుకు: అవుకు మండలం శింగణపల్లె గ్రామం లోని రైతు సేవ కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హాక్ గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి. యమ్. కిసాన్ 5 % ఫిసికల్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి తెలియజేశారు. అలాగే గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పొలాన్ని సందర్శించి వర్షాకాలం ముందు పొడి విత్తనాలు చల్లే పద్ధతిలో భాగంగా నవధాన్యాలను అనగా రాగులు,కొర్ర,జొన్న,మొక్కజొన్న, ఎనుము,ధనియాలు,పెసర, మెంతులు,శెనగ వంటి విత్తనాలను భూమిలో వర్షం రాకముందు చల్లడం ద్వారా సేంద్రియ కార్బన శాతం పెరిగుతుందని,వివిధ రకాల వేర్లు భూమిలో వివిధ సూక్ష్మ జీవులను ఆశ్రయం ఇచ్చుట ద్వారా ప్రధాన పంటకు కావల్సిన పోషకాలు లభిస్తాయని, నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని,అలాగే పశువులకు పచ్చి గడ్డి మేతగా ఈ పంటలు ఉపయోగ పడతాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకులు భాషా, సేంద్రియ వ్యవసాయ బృందం ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

స్కూటీ ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

విశాలాంధ్ర-పాణ్యం : పాణ్యం మండల కేంద్రం రంగయ్య రైస్ మిల్ సమీపంలోని జాతీయ రహదారిపై ఎక్సెల్ స్కూటీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందడం జరిగిందని ఎస్ఐ అశోక్ తెలిపారు. ఎస్సై అందించిన వివరాల మేరకు మృతుడు కల్లూరు మండలం ముజఫర్ నగర్ కు చెందిన ఆటో డ్రైవర్ శ్రీరాములుగా గుర్తించడం జరిగింది.అతను ఆటోలో కర్నూలు వైపు వెళ్తూ రంగయ్య రైస్ మిల్ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా సుగాలి మెట్ట నుండి పాణ్యం వైపు వస్తున్న ఎక్సెల్ స్కూటీ ఢీకొని తలకు తీవ్ర రక్తస్రావం జరిగే మృతి చెందడం జరిగిందన్నారు.పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించడం జరిగిందన్నారు.

బందోబస్తు మధ్య పంచాయతీ వేలంపాటలు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల కేంద్రమైన చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతి లీజుకు సంబంధించి వేలంపాటలను నంద్యాల డిఎల్పీఓ రాంబాబు సమక్షంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య పంచాయితీ సమావేశ భవనంలో ఈఓ ప్రకాశం గురువారం వేలంపాటను నిర్వహించారు. గ్రామ పంచాయితీకి సంబంధించి బస్టాండు, వారపుసంత, కబేళా, బండ్లమేట్ట, దిన మార్కెట్టు, మార్కెట్లోని 8 రూములు, 5 ప్లాట్ఫాంలు, కోటగడ్డ పంచాయితీ రెండు రూములు (01-07-24 నుండి 31-03-2025 వరకు) లీజుకు ఇవ్వటానికి వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలకు సుమారు 8 మంది డిపాజిట్లు చెల్లించి వేలం పాటలలో పాల్గొన్నారు.బస్టాండు రూ.6,35,000, వారపుసంత-రూ.1.81,000లకు నాయబ్ రసూల్ దక్కించుకోగా, దినమార్కెట్-రూ.70,000, కమేళ-రూ.93,000లకు ఖాదరుసేన్ దక్కించుకున్నారు. కోటగడ్డ వద్ద ఉన్న రెండు రూములు ఒక్కొక్కటి రూ.812లకు బాష, జమాల్వలిలు దక్కించుకున్నారు. ఈ వేలం పాటలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ఆళ్ళగడ్డ రూరల్ సిఐ హనుమంత నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమణయ్య గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ ని వ్యతిరేకిస్తూ నంద్యాలలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైనట్లు నాయకులు తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు, ఏఐఎస్ఎ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను, కళాశాలలను బంద్ చేయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహించడంలో సంస్థ తీవ్రంగా విఫలం చెందిందని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని, అలాగే నెట్ ఎగ్జామ్ గ్రేస్ మార్కులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ను లక్షలాది రూపాయలకు బహిరంగంగా మేము అమ్ముకున్నాం అని చెప్పినా కూడా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అని తెలిపారు. పేద విద్యార్థులు మెడికల్ విద్యను అభ్యసించాలని లక్షలకు లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకొని నీట్ ఎగ్జాం రాస్తే ఎగ్జామ్ పేపర్ లీక్ చేయడమంటే పేద విద్యార్థుల కడుపు కొట్టడమే పనిగా పెట్టుకున్నట్లు అర్థమవుతుంది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సంస్థను వెంటనే రద్దు చేయాలని నీట్ పేపర్ లీకేజ్ పై నిర్లక్ష్యం వహించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్త్ రఫ్ చేయాలని కోరారు. నీట్ ఎగ్జాం ను రద్దుచేసి మళ్లీ పకడ్బందీగా నీట్ ఎగ్జాం నిర్వహించాలని సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహించాలని ఆయన కోరారు.

జిల్లాలో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నంద్యాల : స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలకులతో వీరోచిత పోరాటం చేసి అసువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎ. పద్మజ పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 27 సంవత్సరాల వయసులోనే అన్ని విద్యలు సముపార్జించి, వ్యక్తిగత సుఖం కోసం కాకుండా స్వాతంత్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. ఆనాడు ప్రజలు పడుతున్న కష్టాలను చూసి ప్రజల విముక్తి కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్న ధైర్యశాలి భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం నుండి అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలు స్వాతంత్ర సాధన కోసం చేసిన పోరాటాల డాక్యుమెంటరీ చిత్రీకరణ చేసి భావితరాలకు తెలియజేసే విధంగా చేయడం జరిగిందన్నారు. మన్యం ప్రాంతాలలో అక్కడి నివాసితులను దురలవాట్లకు దూరం చేసి వాళ్ళందరినీ ఒక తాటికి తీసుకుని వచ్చి యుద్ధ నైపుణ్యంలో శిక్షణ నేర్పించి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించే తీసుకువచ్చారన్నారు. అతి తక్కువ వనరులు ఉన్నప్పటికీ ఆత్మ స్థైర్యంతో బ్రిటిష్ పాలకులతో పోట్లాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదాపై మండిపడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రమైన కొలిమిగుండ్ల గ్రామ పంచాయతీలో మార్కెట్, బండ్ల మెట్టకు సంబంధించి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉన్నపలంగా వేలం పాటను వాయిదా వేయడంపై పంచాయతీ కార్యదర్శి పై ప్రజలు మండి పడుతున్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో గురువారం సాయంత్రం మూడు గంటలకు మార్చి 31,2025 వరకు మార్కెట్ సుంకం వసూలు చేసుకొనే హక్కు వేలంపాట వేస్తున్నట్లు వారం రోజుల నుండి గ్రామంలో చాటింపువెయ్యడంతో పాటు పత్రికలలో అధికారులు ఊదరగొట్టారు. వేలంపాటలో పాల్గొనేవారు 20 వేల రూపాయలు డిపాజిట్ చేయాలిని తెలిపారు. వేలంపాటలో పాల్గొనేందుకు పలువురు సాయంత్రం మూడు గంటలకు స్థానిక శివాలయం వద్దకు చేరుకున్నారు.సంబంధిత అధికారులుగాని, సర్పంచ్ గాని నాలుగు గంటలైనా శివాలయం వద్ద కనపడకపోవడంతో వేలంపాట నిర్వహణ పై అయోమయం నెలకొంది. తీరా అధికారులకు ఫోన్ చేసి అడగగా సర్పంచ్ అందుబాటులో లేకపో వడంతో వేలంపాట వాయిదా వేసినట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలని వారం రోజుల నుండి ఊదరగొట్టిన అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా వేలం పాటను వాయిదా వేస్తారని మండల జనసేన నాయకుడు పెద్దయ్య, తదితరులు మండిపడుతున్నారు. శివాలయం దగ్గరికి ఏ అధికారి రాకపో వడం, వాయిదా వేస్తున్నట్లు తెలపక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇష్టాను సారంగా వ్యవహ రించడంతో గ్రామ పంచాయతీకి రావలసిన ఆదాయ నికి గండి పడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తు తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన ఆళ్లగడ్డ యువ శిల్పి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీవాణి బాలసుబ్రమణ్యం శిల్పకళా మందిరంలో భద్రాద్రి రామాలయం నిర్మాణం పూర్తయి అమెరికా దేశంలోని అట్లాంట నగరంలో ప్రతిష్టించేందుకు కేంద్ర మంత్రుల సహాయ సహకారాలను కోరినట్లు శ్రీవాణి బాలసుబ్రమణ్యం శిల్పకళా మందిరం నిర్వాహకులు ప్రముఖ శిల్పి దురుగడ్డ బాల సుబ్రమణ్యం ఆచారి తెలిపారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మైనింగ్ శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను బాలసుబ్రమణ్యం మరి కొంత మందితో కలిశారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తమ శిల్పకళా మందిరంలో నిర్మాణం పూర్తయిన భద్రాద్రి రామయ్య ఆలయం త్వరలోనే అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని అట్లాంటా నగరంలో ప్రతిష్ట కానుండ డంతో ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయా లని కోరుతూ యువశిల్పి బాల సుబ్రహ్మణ్యం ఆచారి మరియు అమెరికా ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల బృందం కేంద్ర మంత్రులను కోరారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి కూడా తీసుకుని వెళ్లాలని కోరుతూ వారు వినతి పత్రం సమర్పించారు. ఇందుకు సానుకూ లంగా స్పందించిన కేంద్ర మంత్రులు తప్పకుండా ఈ విష యాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని భద్రాద్రి రామయ్య ఆలయం విషయంలో కూడా తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేస్తామని శిల్పి దురుగడ్డ బాల సుబ్రమణ్యం ఆచారికి వారు హామీ ఇచ్చారు. అమెరికా ఆలయ ట్రస్టు బోర్డు బృందం పాల్గొన్నారు

కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వండి

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాలో సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసిన 22,740 మంది కౌలు రైతులకు పెద్దఎత్తున రుణాలు అందించి ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి బ్యాంకర్లను సూచించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యుబిఐ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేందర్ గౌడ్, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేష్ కె మహన, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ సుబ్బారెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేయడంతో పాటు జిల్లాలోని 22,748 మంది కౌలు రైతులకు మరింత చేయూతనందించి పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను సూచించారు. అలాగే ఆర్ఓఎఫ్ఆర్ కింద పట్టాలు ఇచ్చిన రైతులకు కూడా రుణాలు అందజేసి ఆదుకోవాలన్నారు. అదే విధంగా పాడిపరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని కావున ఈరంగంలో కూడా తగిన రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న మధ్య తరహా, విద్య, గృహ, రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రంగాలలో అర్హులైన వారందరికీ రుణాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. పరిశ్రమ యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలన్నారు. పీఎంఈజీపి, ముద్ర స్కీము, రుణాలకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు అర్హులైన వారందరికీ రుణాల అందించడంలో బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి బ్యాంకు రుణాలపై ప్రజలు, రైతుల్లో అవగాహన కల్పించాలని బ్యాంకర్లను, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో 18,258 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద 780 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి 1406 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసి180 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. అలాగే పంట రుణాల కింద 5384 కోట్లు, మొత్తం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రుణాలు 8672 కోట్లు, సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల రుణాల కింద 1335 కోట్లు, మైక్రో ఎంటర్ప్రైజెస్ కింద 987 కోట్లు, విద్యా రుణాల కింద 46 కోట్లు, గృహ రుణాల కింద 57 కోట్లు, ప్రాధాన్యత రంగాలకు 10,953 కోట్లు మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం విద్యను అభ్యసించే విద్యార్థులకు విరివిగా రుణాలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అంతకుముందు ఎల్డీఎం రవీంద్ర కుమార్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణాల ప్రణాళిక అమలులో మార్చి 31 నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించినట్లు వివరించారు. ఈ రుణ ప్రణాళికలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక ఇతర ఉపాధి రంగాలకు మంజూరు చేసిన రుణ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎస్బిఐ తదితర బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, అన్ని సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా వరినారు వేస్తున్న రైతన్న

విశాలాంధ్ర - నంద్యాల : గత సంవత్సరం ఖరీఫ్, రబీలో వచ్చిన లాభ సాటి పంటతో మరింత ఉత్సాహంతో వరి రైతు ఖరీఫ్ను ప్రారంభించాడు. అవుకు జలాశయం ఆయకట్టు రైతాంగం ఖరీఫ్లో వరి పంటను సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నాడు. ముందుగా వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతన్న విత్తన శుద్ధి చేసి చదును చేసిన పొలాలలో వరి విత్తనాలను చల్లుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో దాదాపుగా 8 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తుంది.

హైకోర్టు ఏజీపీగా నియమితులైన రవి తేజ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర హైకోర్టు ఏజీపీగా నంద్యాల జిల్లా వాసి నేరెళ్ల ఎస్వీ రవితేజ నియమితులయ్యారు. వీరు ప్రాథమిక విద్య చాగలమర్రి లోనూ, హైస్కూల్ విద్య కర్నూల్ మాంటిస్సోరి స్కూల్, ఇంటర్ హైదరాబాద్ నారాయణ కాలేజీ, లా డిగ్రీ ఉస్మానియా యూనివర్సిటీ, ఎల్ఎల్ఎం, ఉస్మానియా యూనివర్సిటీ మరియు ఇతర పీజీ కోర్సులు నల్సార్ లో చేయడం జరిగింది. 10-09-2015 న ఏపీ బార్ కౌన్సిల్ లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. హైదరాబాదు ట్రయల్ కోర్టులలో మరియు హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీసు చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వీరి నైపుణ్యమును గుర్తించి ఏజీపీగా నియమించింది.రవితేజది చాగలమర్రి మండలం చింతలచెరువు సొంత గ్రామం. తండ్రి నేరెళ్ల చంద్రశేఖర్ . ప్రస్తుతం సీనియర్ న్యాయవాదిగా ఆళ్లగడ్డ కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ వివిధ సోషల్ ఆర్గనైజేషన్ లకు లీగల్ అడ్వైజర్ గా ఉన్నారు. హైకోర్టు ఏజిపిగా నియమితులైన రవిచంద్రను పలువురు అభినందించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర- రుద్రవరం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావ రణాన్ని కాపాడుకో వచ్చని రుద్రవరం సబ్ డిఎఫ్ఓ శ్రీని వాసరెడ్డి, రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. గురువారం డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ నంద్యాల అనురాగ్ మీనా ఐఎఫ్ ఎస్ ఆదేశాల మేరకు రుద్రవరం రేంజ్ లోని అహోబిలం చీతల్ బేస్ క్యాంపు మరియు పాల్కన్ బేస్ క్యాంప్ నూతల సెక్షన్ లలో సబ్ డి ఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి మరియు రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఆధ్వర్యంలో 76వ వనమహోత్సవం కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మొక్కలు నాటడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి మొక్కలను తప్పనిసరిగా నాటాలన్నారు. కొందరు చెట్లను నరకడం చెట్లు అంతరించిపోవడంతో వాతావరణ సమతుల్యత లోపించి అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు సక్రమంగా కురవకపోవడం లాంటివి సంభవిస్తు న్నాయన్నారు. అడవులను కాపాడుకోవడం మన అందరి బాధ్యతని వారు తెలిపారు. డిప్యూటీ రేంజ్ అధికారి ముర్తుజావాలి, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసులు నాయుడు, నాగరాజు, మత్తర్ భాష, అహోబిలం సెక్షన్ మరియు రుద్రవరం రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్లు..



విశాలాంధ్ర - బనగానపల్లె: టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బనగానపల్లి సచివాలయం నందు 18 నుండి 60 సంవత్సరాలు గల వయసు వారు వారికి అడల్ట్ బీసీజీ వ్యాక్సన్ డాక్టర్ శివ శంకర్ ఆధ్వర్యంలో వేయడం జరిగింది . ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల టీబీ జబ్బులు సంబంధించి, ఇన్ఫెక్షన్ గాని టీబి జబ్బులు గాని రాకుండా నివారించగలదన్నారు. స్టాప్ డయేరియా ప్రోగ్రాం జులై 1 నుంచి ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిల్లలందరికీ ఎవరైనా అతిసారం సోకిన పిల్లలని ఆశాలు గుర్తించి ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ అందించాలని ఏఎన్ఎంలు ,సూపర్వైజర్ కు తెలియజేయమని ఆదేశించడం జరిగిందన్నారు. గర్భవతులను పరీక్షించి వైద్య పరీక్షలు జరిపి , వాళ్లకు తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ ఎస్ వెంకటేశ్వర్లు ,సూపర్వైజర్ అయ్యమ్మ ,ఎం ఎల్ హెచ్ పి రమేష్, ఏఎన్ఎం గ్రేసమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫీల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: మండలంలో ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేటీలుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి ఫీల్డ్ అసిస్టెంట్లగా పదోన్నతులు లభించినట్లు ఏపీవో రవి ప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సర్వాయిపల్లె, ఇంజెడు, ఆర్.జంబులదిన్నె గ్రామాలలో సీనియర్ మేటీలుగా విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణ, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్ రావులకు ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ లాగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి అందాయని ఆయన స్పష్టం చేశారు.

వసుధ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - బనగానపల్లె: వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన వెంకట రామరాజు సహకారంతో 58,000 విలువ గల చెక్కులను 10 మంది పేదవారికి కర్నూల్ నంద్యాల ఉమ్మడి జిల్లాల వసుధ ఫౌండేషన్ అధ్యక్షులు ,తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టంగుటూరి సీనయ్య మాట్లాడుతూ వసుధ ఫౌండే తరపున గత పది సంవత్సరాల నుంచి 60 లక్షలు పైగా చెక్కుల పేదవారికి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగల పరమేశ్వర్ రెడ్డి, బత్తుల భాస్కర్ రెడ్డి, బత్తుల బాలిరెడ్డి, గోపాల్ రెడ్డి, భరతుడు,మల్లేష్ రెడ్డి,తలారి తిరుమలయ్య, టీచర్ నాగరాజు, కోడి నాగేష్, మల్లారెడ్డి,ఆటో ఆకుల బాబయ్య, ఆటో దేవుడు, వంకదార ప్రసాద్, సంగు శ్రీనివాస్ రెడ్డి, కాసు జంగం శెట్టి, బాలరాజు యాదవ్, ఆకుల షేక్షావలి, యాగంటి పల్లె దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో అల్లూరి జయంతి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నమస్సుమాంజలి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర చరిత్రలో అల్లూరి సీతారామరాజు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయంగా మిగిలిపోయిందని, 1897 జులై 4వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వద్ద ఉన్న పాండ్రంగి గ్రామంలో వెంకట రామరాజు, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించాడన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మిన వ్యక్తి స్వతంత్రం కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడుగా చరిత్రలో నిలిచిపోయాడని, కేవలం 27 ఏళ్ల వయసులోనే నిరుపేదల, నిరక్షరాస్యుల, అమాయకులైన అనుచరులతో చాలా తక్కువ యుద్ధ పరికరాలతో బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి వారికి ముచ్చెమటలు పట్టించి వీరమరణం పొందిన మన్యం వీరుడు మన అల్లూరి సీతారామరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పి కె. ప్రవీణ్ కుమార్, డిఎస్ పి శ్రీనివాసులు, కార్యాలయ అధికారులు నిజాముద్దీన్, ఖాదర్ వలీ, ఎస్పీ సిసి నాగరాజు, ఇన్స్పెక్టర్లు రవీంద్ర, చంద్రబాబు నాయుడు,రిజర్వు ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు, నాగభూషణం, పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె..

కొవెలకుంట్ల..

ఆత్మకూరు రూరల్..

ప్యాపిలీ..

డోన్..

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 05, జూలై 2024

విద్యాసంస్థల బంద్ విజయవంతం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : దేశవ్యాప్తంగా బంద్‌లో భాగంగా జిల్లాలో అన్ని విద్యాసంస్థలు బంద్ నిర్వహించారు. స్థానిక గాయత్రి ఎస్టేట్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యస్ షాబీర్ బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ, పిడిఎస్ఓ జిల్లా నాయకులు తిరుమలేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకే జరిగిందని విద్యార్థులు విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన కార్య క్రమాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం చాలా మౌనంగా ఉందన్నారు. నీట్ పరీక్షను రద్దుచేసి, మళ్లీ తిరిగి నిర్వహించాలన్నారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఎన్‌టిఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకి అప్పగించాలని, దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్లో చర్చ జరగాలని అడుగుతుంటే ప్రతిపక్షాల గొంతును హరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ నీట్ పేపర్ లీకేజ్ కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర విశ్వ విద్యాలయాలలో విద్యార్థి సంఘాల నాయకులు, వారి హక్కుల కోసం ఆందోళన చేస్తుంటే అక్రమంగా అరెస్ట్ చేసి పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడదాం అనేసి వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్, నగర అధ్యక్షుడుఅశోక్, నాయకులు, అభి, అఖిల్, మహేష్, ఐక్య విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం : జి.చంద్రశేఖర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమలు చేస్తాననడం అభినందనీయమని ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఏఐటీ యూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డిసి రెహమాన్‌లు మాట్లాడుతూ 2019లో అధికారం లోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని రద్దుచేసి బడా పెట్టుబడి కంపెనీలకు ఇసుక అమ్మ కాలనీ ప్రవేశపెట్టడంతో ఎంతో మంది భవన నిర్మాణ కార్మి కులకు పనులు లేక వీధులపాలైన ఆత్మహత్యలకు పాల్ప డ్డారని ఆవేధన వ్యక్తం చేశారు. ధీంతో భవనని ర్మాణ కారి ్మకుల ఆగ్రహానికి గురై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారం కోల్పోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టి కార్మికులకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. జీవో నెంబర్ 17 రద్దుచేసి గత ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డులో 450 కోట్లు వాడుకున్న నిధులను తిరిగి సంక్షేమ బోర్డులో జమచేసి పెండింగ్ ఫైళ్లను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటియుసి డిప్యూటీ సెక్రెటరీ టి. రామాంజనేయులు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి. డి. నల్లన్న, రేణుక, రంగనాయకులు, కృష్ణ, ఇర్మియ పాల్గొన్నారు.

నగరపాలక వాహనాలకు వాటర్ సర్వీసింగ్ కేంద్రం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగర పాలక సంస్థకు చెందిన వాహనాలు వాటర్ సర్వీసింగ్ చేసుకునేందుకు వీలుగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కమిషనర్ ఏ.భార్గవ్ తేజ చర్యలు చేపట్టారు. గురువారం సుంకేసుల రోడ్డులోని పాత పంప్ హౌస్‌ను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అక్కడ వాటర్ సర్వీసింగ్‌కి రెండు పాయింట్లు ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, రిటైర్డ్ ఏఈ రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతుసంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - కర్నూలు : ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29, 30, 31తేదీలప్లఘో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు జరుగుతున్నాయని, ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాధం ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఈ శిక్షణా తరగతులు 26 జిల్లాల నుండి రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నారన్నారు. ఈశిక్షణా తరగతులు దాదాపు 300 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ తరగతులలో రాబోయే సంవత్సరాల్లో రైతు సంఘ ఉద్యమాలు, రైతులకు చేయవలసిన, చేయాల్సిన సేవా కార్యక్రమాలు తదితర అంశాల గురించి చర్చిస్తారని తెలిపారు. జిల్లా నుండి ఎంపికైన కార్యకర్తలు మూడు రోజులపాటు ఈ శిక్షణా తరగతులలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ శిక్షణా తరగతులలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు, రైతు సంఘం జాతీయ నాయకులు పాల్గొంటారని తెలియజేశారు.

యువతకు ఆదర్శనీయం అల్లూరి : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు విప్లవ కిశోరం అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శనీయం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి వేడుకలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ పోరాటంలో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అల్లూరి పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం అల్లూరి అలుపెరగని పోరాటం చేశారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పెద్దయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పి. భీమ లింగప్ప,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, నియోజకవర్గ కార్యదర్శి హనుమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

జొన్నగిరి ఎస్సై బదిలీ.. కొత్త ఎస్సైగా చంద్ర

విశాలాంధ్ర - తుగ్గలి: తుగ్గలి మండల పరిధి లోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ లో ఎస్ఐగా విధులను నిర్వహిస్తున్న రామాంజనేయులు జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గురువారం బదిలీ అయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు స్పెషల్ బ్రాంచ్ నందు విధులు నిర్వహిస్తున్న చంద్ర గురువారం జొన్నగిరి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై రామాంజనేయులు కు జొన్నగిరి పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించి పూలమాలలు వేసి, బహుమతులను ప్రదానం చేసి వీడ్కోలును పలికారు. అదేవిధంగా నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన చంద్రకు జొన్నగిరి పోలీస్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. బదిలీ అయిన ఎస్సై రామాంజనేయులు మాట్లాడుతూ ఇన్ని రోజులు తనకు సహకరించిన పోలీస్ సిబ్బందికు కృతజ్ఞతలు తెలియజేశారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ : రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను వక్రీకరించడం సబబు కాదని, రాహుల్ గాంధీ అన్ని కులాలను, మతాలను గౌరవిస్తారన్నారు. బీజేపీ నాయకులు మత విద్వేషాలు సృష్టించడం సబబు కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, తదితరులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : జీఓ నెం.117ను రద్దు చేయాలని ఎస్టీయూ నేతలు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి వినతి పత్రం అందచేశారు. గురువారం ఎస్టీయూ గోనెగండ్ల మండల శాఖ తరపున ఎమ్మిగనూరు శాసన సభ్యులు జయనాగేశ్వర రెడ్డిని కలిసి 117 జీఓ రద్దు చేయాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలు సమాంతరంగా కొనసాగించాలని, ఐఆర్ 30శాతం ఇప్పించాలనీ, ఉపాధ్యాయులును బోధనేతర పనులకు దూరంగా ఉంచాలన్నారు.. జిల్లా కార్యదర్శి శ్రీధర్, గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శి, రాఘవేంద్రుడు, చంద్రశేఖర్, గోవర్ధన్ మరియు సీనియర్ నాయకులు నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని సన్మానించిన కార్మికులు

విశాలాంధ్ర - ఎమ్మిగ నూరు : ఎమ్మెల్యేగా విజయం సాధించిన డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డిని పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం లో పారిశుద్ధ్య విభాగం లో పని చేస్తున్న కార్మికులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని పారిశుద్ధ్యం కార్మికులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులు, కార్మిక నాయకులు కె.సల్మాన్, ఎ.శివకృష్ణ, బి.ఎల్లప్ప, జె.నాగరాజ్, ఎం ప్రతాప్, కె.ఇస్మాయిల్, రవి, రాముడు, తిక్కయ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించండి : సీపీఐ

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : మండల కేంద్రంలో బీసీ బాలుర వసతిగృహం, తెర్నేకల్ నందు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడాలని సీపీఐ మండలకార్యదర్శి నరసరావు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్‌లు డిమాండ్ చేశారు. గురువారం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏఎస్‌డబ్ల్యూఓని దేవనకొండ సచివాలయంలో కలిసి విద్యారంగ సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మండలం నిత్యం కరువు కాటకాలతో ప్రజలు వలసలు వెళుతున్న నేపథ్యం అందరికీ తెలిసిందేనన్నారు. తల్లిదండ్రులు వలసలు వెళ్లే సమయంలో విద్యార్థులను చదువులు మాన్పించి వారి వెంట సుధీర ప్రాంతాలకు వలసల వెళ్లడం జరుగుతుందన్నారు. దీనంతటికీ కారణంగా దేవనకొండ మండల కేంద్రంలో విద్యార్థులు చదువుకునేందుకు సరైన హాస్టల్ వసతి లేకపోవడమే కారణంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో బీసీ, తెర్నేకల్ నందు ఎస్సీ బాలుర, దేవనకొండ నందు బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనేకమార్లు కమ్యూనిస్టు పార్టీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించినప్పటికీ అధికారుల నాయకుల పట్ల చలనం రాలేదన్నారు. ఇప్పటికైనా 44 గ్రామాలకు కేంద్రంగా ఉన్న దేవనకొండ మండల కేంద్రం నందు విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని వసతిగృహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ నాయకులు కోమేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పర్కించండి -ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గోనెగండ్ల: గోనెగండ్ల పట్టణానికి తాగునీటి సమస్యను వేంటనే పర్కించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. జలజీవన్ మిషన్ క్రింద రూ. 2.50కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆర్ డ్యబ్లూఎస్ డీఈ సాంబయ్య తెలిపారు. గోనెగండ్లకు 3ఓహెచ్ ఆర్ ట్యాంక్‌లు మంజూరు చెసిన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 3నెలలు జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేసి గోనెగండ్ల గ్రామకు త్రాగునీరు అందించాలని కోరారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు క్రింద రూ. 8 కోట్ల గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకె సెంటర్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్ఆర్‌జీఎస్ పనులు క్రింద రూ. 1.50 లక్షలు పనులు చేయించామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సోనీ బాయ్, తహశీల్దార్ పార్వతి, సర్పంచ్ పూజారి హైమవతి, పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు : ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతా రామరాజు 127 జయంతి వేడుకలను సీఆర్ భవన్ నందు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగరనాయకులు చంటి అధ్యక్షత వహించగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి శ్రావణిలు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని దేశం నుండి తరిమి కొట్టడమే ఏకైక పరిష్కారం అని భావించిన అల్లూరి సీతారామరాజు మన్నెం ప్రజల్లో చైతన్యం నింపి వారిలో ఉన్న తాగుడు దురాలవాట్లను దూరం చేసి వారిలో చైతన్యం నింపారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు సురేంద్ర యాదవ్, కాసిం, రాజశేఖర్ , హుస్సేన్ భాష, నాగేశ్వరరావు, శివ, మహిళా సమైక్య నాయకురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేని పాలనను ప్రజలకు అందిద్దాం

విశాలాంధ్ర- ఆదోని : ఇన్నాళ్లు ఒక లెక్క, ఇక నుండి ఒక లెక్క ఆదోని నియోజకవర్గ ప్రజలకు అవినీతికి తావులేని పాలనను అందిద్దామని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. గురువారం సబ్ రిజిష్టర్ డాక్యుమెంట్ రైటర్లతో, మున్సిపల్, మండల పరిధిలోని సచివాయల ఉద్యోగులతో సమావేశాలను నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ సబ్ రిజిష్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచి చేసి డాక్యుమెంట్ రైటర్లు, అధికారులు అవినీతికి తావులేకుండ పని చేయాలని, మఠం భూములు, వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండ చూడాల్సిన బాధ్యత కూడ మీపై వుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అధికారులు తమ ఉద్యోగ బాధ్యతను నిర్వర్తిచ్చి ఆదోని అభివృద్ధికి పాటు పడాలని, అధికారులకు అండగా వుంటానని, మీకు ఎలాంటి ఇబ్బందులకు కలిగించిన నేరుగా నన్ను కలవచ్చని, మన మంతా కలిసి కట్టుగా పని చేసి రాజకీయాలను, పార్టీలను పక్కన పెట్టి అభివృద్దే పార్టీ లుగా పని చేద్దామని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్, నాయకులు సాయికుమార్, ఉపేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకతలపై విచారణ జరపాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోనే కారుమంచి గ్రామంలో గత ప్రభుత్వంలో నిర్వహించిన భూ రీసర్వేలో రెవిన్యూ అధికారులు అవినీతి అక్రమాలు, అవకుతవకలకు పాల్పడ్డారని మాజీ ఎంపీటీసీ శివానంద, గ్రామ పెద్దలు జోగి రంగప్ప, శ్రీరాములు, చంద్రలు ఆరోపించారు. గురువారం స్థానిక గాంధీ పార్కులో రైతులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూహక్కు చట్టం ద్వారా రాష్ట్రంలో భూ రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కారుమంచి గ్రామంలో జరిగిన భూ రీసర్వేలో పొలాలు తిరిగి సర్వే చేసిన రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఒకరి సర్వే నెంబర్లు మరొకరికి ఎల్ పి నెంబర్ లు ఇవ్వడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో డిప్యూటీ తాసిల్దార్, విఆర్ఓ, సర్వేయర్లు, వీఆర్ఏలతో కలిసి రైతుల దగ్గర లక్షలాది రూపాయలు అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

దుకాణదారులు బకాయిలు త్వరగా చెల్లించాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: మున్సిపల్ దుకాణదారులు తమ బకాయిలు వెంటనే చెల్లించాలని కమిషనర్ ఏ.భార్గవ్ తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నగరపాలక రెవెన్యూ అధికారులతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, రూ.27,52,234 లక్షల బకాయిలు రాబట్టడం జరిగిందని కమిషనర్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్ ఇంకా కొనసాగుతుందని, దుకాణదారులు బకాయిలు చెల్లించడం ఆలస్యం అయ్యేకొద్ది జరిమానా పెరుగుతూనే ఉంటుందన్నారు. బకాయిలు చెల్లించడం విఫలమైతే షాపులు సీజ్ చేసి కోర్టు ద్వారా జరిమానాతో సహా వసూలు చేయడం జరుగుతుందన్నారు. కావున దుకాణదారులు తక్షణమే బకాయిలు చెల్లించాలని కమిషనర్ కోరారు.

నాయకల్లులో ఇసుక ట్రాక్టర్ల లొల్లి

- వాహనాలు పరారీ ఒక ట్రాక్టర్ స్వాధీనం
- ఉన్నతాధికారుల దృష్టికి చేరిన వైనం
- తలలు పట్టుకుంటున్న అధికారులు

విశాలాంధ్ర- కల్లూరు: నాయకల్లు గ్రామ పరిసర ప్రాంతంలో ఉన్న హంద్రీ నదిలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ వాహనాలను అదుపులోకి తీసుకుంటున్న సంఘటనలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని ఘర్షణ వాతావరణం నెలకొన్న సంఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు మండల పరిధిలోని నాయకల్లో గ్రామంలో గురువారం హంద్రీ నది లో ఇసుకను అక్రమంగా తరలించేందుకు ఐదు ట్రాక్టర్లు నదిలో కనిపించడంతో గ్రామస్తులు పథకం ప్రకారం వెళ్లి ట్రాక్టర్లను పట్టుకునే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ట్రాక్టర్లు పట్టుకోని గ్రామంలోకి తీసుకెళ్లాలని కొందరు లేదు పోలీసులకు అప్పగించాలని మరికొందరు ఒకరికొకరు చర్చించుకునే లోపే గ్రామస్తుల కళ్ళు కప్పి నాలుగు ట్రాక్టర్లు హంద్రీ నది నుండి తప్పించుకొని వెళ్లినట్లు ఆ క్రమంలో ట్రాక్టర్ల ఫోటోలు కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నిసార్లు ట్రాక్టర్ సిబ్బందిని హెచ్చరించిన తమకేమీ పట్టి పట్టనట్లుగా వచ్చి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఆదాయాలజిస్తుండడంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలనె నెపంతో ట్రాక్టర్లను పట్టుకొని గ్రామ పరిధిలోనే భారీ జరిమానాలు వేసి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ ను గ్రామ పరిసర ప్రాంతంలో ఉంచినట్లు తెలిపారు. తప్పించుకున్న ట్రాక్టర్లను కూడా పట్టుకొని జరిమానాలు విధించేలాగా పోలీస్, మైనింగ్ ,రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. గత దశాబ్దాలుగా నది పరివాహక ప్రాంతాన్ని కాపాడుకుంటూ వస్తున్నామని ఇసుకను అక్రమంగా తరలించకుండా ఎప్పటికప్పుడు కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ రావడంతో భూగర్భ జలాల సమస్య నేటి వరకు తలెత్తకుండా. తాగు, సాగునీటిని అందిస్తుందన్నారు. ఇసుక రవాణా చేస్తే పట్టుకొని సీజ్ చేయిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఉలిందకొండ ఎస్సై నరేష్ ను వివరణ కోరగా ఇసుక ట్రాక్టర్ను పట్టుకున్న మాట వాస్తవమేనని ట్రాక్టర్ను గ్రామస్తులు పోలీసుల కప్పగిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేసి వారికి జరిమానాలు పడేలా చూస్తామని తెలియజేసినట్లు తెలిపారు. చట్టం తన పని తాను చేసుకోబోతుందని చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోకూడదని ఏదైనా సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు 127 వేడుకలు

విశాలాంధ్ర -జిల్లా పరిషత్ : జిల్లా ప్రజా పరిషత్ మినీ మీటింగ్ హాల్లో గురువారం అల్లూరి 127వ జయంతి వేడుకలు డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపు కున్నారు. మొదటగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. సీఈవో వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమం చరిత్ర తిరుగు ద్వారా పిటిషన్ అధికారుల గుండెల్లో గూగుల్ పుట్టించిన గొప్ప విప్లవకారుడన్నారు. సూపరిడెంట్ రామ్ గోపాల్, సరస్వతి, సీసీ భరత్, సీనియర్ అసిస్టెంట్ ఉమా పాల్గొన్నారు.

ఆదోని..

హోళగుంద..

ఎమ్మిగనూరు..

కర్నూలు..

కోడుమూరు..

పత్తికొండ...

ఆలూరు..

వెల్దుర్తి..

జీవనశైలి కారణంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: జీవనశైలి కారణంగా కొన్ని రకాల క్యాన్సర్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, మీ లైఫ్ స్టైల్ లో మార్పులు చేస్తే ఈ క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్యకరమైన జీవనశైలి అలవాట్ల కారణంగా క్యాన్సర్ వ్యాధి విపరీతంగా వ్యాపిస్తుందని అన్నారు. ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, మద్యం సేవించడం, ధూమపానం వంటి అలవాట్ల వలన క్యాన్సర్ వ్యాధి వస్తుందని తెలిపారు. సరైన అలవాట్లను అలవర్చుకుంటే క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చునని పేర్కొన్నారు. ఆడవారికి రొమ్ములో గడ్డలు, గర్భాశయం ముఖ ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ వచ్చినప్పుడు బరువులు తగ్గే అవకాశం ఉంటుందని, ఈ లక్షణాలను కలిగిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిపై స్క్రీనింగ్ టెస్ట్‌ల గురించి తరువాత స్వీయ పరీక్ష నిర్వహించుకోవడంపై వివరించినారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 05, జూలై 2024

రాహుల్ గాంధీ మాటలను వక్రీకరించారు

విశాలాంధ్ర - ఆదోని : బిజెపి నాయకులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాటలను వక్రీకరించారని ఆదోని నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ రమేష్ యాదవ్ అన్నారు. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశాలు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో బిజేపీ, ఆరెస్సెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ళలో బిజెపి చేసిందేమీ, రాహుల్ గాంధీ సభలో చెప్పిన మాటలు వక్రీకరిస్తున్నారన్నారు. హిందువులను కించపరిచే విధంగా మాట్లాడలేదని, హింసను ప్రేరిపించేసేవాడు, విద్వంసాలను సృష్టించేవాడు హిందువు కాదు అని అన్నాడే తప్ప హిందువుల మనోభావాలు దెబ్బతీయలేదన్నారు. గత బిజెపి ప్రభుత్వ హయాంలో మణిపూర్ ఘటన దేశానికే తలమానికం వంటిది. యావత్ ప్రపంచం మణిపూర్ ఘటన ధిక్కాభ్రాంతి గురిచేసింది. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు స్పందిస్తున్నారు, పౌరులుగా తమ బాధ్యతలను నెరవేరుస్తున్నారు. ఇంత పెద్ద హెూదాలో ఉన్న ఇప్పటికి దేశ ప్రధాని బాధితులను ఓదార్చలేదని విమర్శించారు. భరోసా, ఉపశమనం కలిగించే విదంగా చర్యలకు దిగలేదని, ఈ అంశంపై ఆరెస్సెస్ లాంటి సంఘాలు ప్రశ్నించవ అని మండిపడ్డారు. గత పదేళ్ళలో మోడీ నియంత పరిపాలన సాగిందని, ఇప్పుడు అలా జరిగే ప్రసక్తే లేదని, ప్రజల గొంతు వినిపించడానికి రాహుల్ గాంధీ ఉన్నారని అన్నారు. రాహుల్ గాంధీ ప్రశ్నల వర్షానికి బిజెపి అల్లాడిపోతుందని, ఉత్తరప్రదేశ్‌లో నిన్న జరిగిన ఘటన శోచనీయం అని అన్నారు. 120మంది ప్రాణాలు కోల్పోయారు ఇందుకు బాధ్యత వహిస్తూ యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిలీప్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, రామకృష్ణ రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షుడు దేవిశెట్టి వీరేశ్, శ్రీనిత్, మండల అధ్యక్షుడు మోహన్, ఎస్సి సెల్ పట్టణ అధ్యక్షుడు మాణిక్యరాజు, కాంగ్రెస్ నాయకులు రామన్న యాదవ్, హనుమంతు, రఫిక్, నిసార్ అహ్మద్, పాల్గొన్నారు.

అల్లూరి ఒక పోరాట స్ఫూర్తి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అల్లూరి సీతారామరాజు ఒక పోరాట స్ఫూర్తి అని, వారి ధైర్య సాహసాలు యువతకు ఆదర్శనీయం అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు.గురువారం అల్లూరి సీతారామరాజు 126 వ జయంతి సందర్బంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహెూజ్వల శక్తి అని, ఆయన జరిపిన పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు.. అల్లూరి సీతారామరాజు ను ఆదర్శంగా తీసుకొని దేశ, సమాజ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. అల్లూరి సీతారామరాజు చరిత్రను విద్యార్థులు అంతా తప్పకుండా తెలుసుకోవాలని, అల్లూరి స్ఫూర్తి ని ఆదర్శంగా తీసుకుని నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు..గిరిజనులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసేవారని, అడవి లో ఉండే ఉత్పత్తులు సేకరించి అమ్ముకునే వారిపై దమనకాండ చేస్తుండగా బ్రిటిష్ వారిపై వివిధ రకాలుగా పోరాడి వారికి విముక్తి కల్పించిన వ్యక్తి అల్లూరి అన్నారు. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశ యువత ముందుకు సాగాలని కలెక్టర్ అన్నారు. ఉద్యోగపర్వంలో ఏజెన్సీ ప్రాంతంలో సేవ చేసే సౌభాగ్యం తనకు కలిగిందని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన రావు, జిల్లా గిరిజన మరియు సాంఘిక సంక్షేమ అధికారి రంగలక్ష్మి దేవి, డిపిఓ నాగరాజు నాయుడు, కర్నూలు ఆర్‌డిఓ శేషి రెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, రవి శాస్త్రి, శాంత కుమార్, శామ్యూల్, ప్రభుదాస్, రమేష్ బాబు, నవీన్ కుమార్, సాయి ప్రదీప్, లంబాడా, గిరిజన, సుగాలి నాయకులు ఎరుకల రాజు, చంద్రప్ప, మద్దిలేటి, యోగేష్ నాయక్, గుండాల నాయక్, రాముడు నాయక్, శ్రీను నాయక్, కృష్ణ, ఉద్యోగ సంఘ నాయకులు మద్దిలేటి నివాళ్లర్పించారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి : కేఈ శ్యాం బాబు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల అధికారులు విధుల పట్ల బాధ్యతా యుతంగా పని చేయాలని పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఠాగూర్ సమక్షంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మూడు నెలలు జరిగిన అభివృద్ధి నివేదికను అన్ని శాఖల అధికారులు చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేఈ శ్యాం బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని ఆయన అధికారులకు సూచించారు. మండలంలో పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీపై వెళ్లొచ్చని ఆయన వారికి తెలిపారు. పనిచేసే అధికారులకు ఎప్పుడు కూడా టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ నిధులు గ్రామ సర్పంచ్ ఖాతాలోనే ఉంటాయని వైసిపి ప్రభుత్వం చేసిన మోసం టిడిపి ప్రభుత్వం చేయదని ఆయన అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారులకు ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధరెడ్డి, వైస్ ఎంపీపీ బోయసుశీల, కేయి నందిస్ గౌడ్, ఆలంకొండ నభిసాహెబ్, దామోదర్ నాయుడు, అధికారులు గ్రామ సర్పంచ్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల కిట్లను పంపిణీ..

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులకు పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు. వెలుగోడు పట్టణంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిడిపి నాయకులు పాల శంకర రెడ్డి , ట్రైలర్ నాగస్వామి, జెడ్పిటిసి అమీరున్ బీ, ఎంపిపి లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, విద్యా కమిటీ ఛైర్మన్ ఆచ్చయ్య,ఉపాధ్యాయులు కిట్ల పంపిణీ లో పాల్గొన్నారు. మోడల్ స్కూల్ లో టిడిపి నాయకులు మాజీ ఎంపిపి సీతమ్మ, మాజీ సర్పంచ్ కలాం, శేషిరెడ్డి, డా.జాకీర్, విద్యా కమిటీ ఛైర్మన్ సూర్య నారాయణ, ప్రిన్సిపాల్ నళిని, ఎంఇఓ బ్రహ్మం నాయక్ పాల్గొని విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఎంపిపి స్పెషల్ స్కూల్‌లో, ఉర్దూ బాలికల పాఠశాలలో, మిగతా పాఠశాల ల్లో టిడిపి నాయకులు పంపిణీ చేశారు.

ఘనంగా సీతారామరాజు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు 127వ జయంతిని పురస్కరించుకొని అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షుడు టి. అమిర్ భాష ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని ప్రభుత్వ వైపిపియం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వీర రాఘవయ్య ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ మండల విద్యాధికారి శోభా వివేకవతి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపాధ్యాయ బృందము మరియు విద్యార్థి బృందం కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమీర్ భాష మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్రం కోసం ముందుండి ఉద్యమాలు నిర్వహించారన్నారు. దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషారెడ్డి నారాయణరెడ్డి, మాధవి స్వామి రెడ్డి, వెంకటరాముడు, రమణ, ఖాజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ప్రతిష్టతకు భంగం కలిగిస్తే సహించేది లేదు

విశాలాంధ్ర - కల్లూరు: వైసీపీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, టీడీపీ అధికారం చేపట్టి నెలలు పూర్తికాక ముందే వైకాపా అభివృద్ధిపై కార్యకర్తలపై దాడులకు పాల్పడడం హేమమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని కాటసాని స్వగృహంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ అన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించామని నేడు టిడిపి నాయకులు, కార్యకర్తలు వాటికి విరుద్ధంగా వైసీపీ శిలాఫలకాలు, స్థూపాలపై కార్యకర్తలపై దాడులు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు అవలంబిస్తున్న నీచమైన రాజకీయాలకు స్వస్తి పలికి, అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు : జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు సంబంధితులకు పరిహారం అందచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో భూ సేకరణ అంశంపై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 340సి కింద నంద్యాల చెక్ పోస్ట్ నుండి గార్గేయపురం వరకు, సఫా కళాశాల నుండి గార్గేయపురం వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులకు సంబంధించి రెండు గ్రామాలకు త్వరితగతిన పరిహారం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్బిట్రేషన్ కేసులు ఎన్ని వచ్చాయి, ఎన్ని డిస్పోస్ అయ్యాయి, ఎన్ని పెండింగ్లో ఉన్నాయని వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకు న్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి

విశాలాంధ్ర-అవుకు: వంగవీటి మోహన రంగా 77వ జయంతి వేడుకలను అవుకు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాపు సంక్షేమ సేన నంద్యాల జిల్లా అధ్యక్షుడు దంతెల రమణ ఆధ్వర్యంలో వంగవీటి రంగ జయంతి వేడుకలను కాపు సంక్షేమ సేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం వంగవీటి మోహన రంగా ఎంతగానో కృషి చేశారని అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుడిపాటీ రామకృష్ణ, గొడుగు నంది, పోతుల మురళి, వెంకటయ్య మధు,రవీ, రంజిత్, హరి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేత

విశాలాంధ్ర - బనగానపల్లె : ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు అవ్వ తాతల పెన్షన్ కానుకను బనగానపల్లె కు చెందిన 96వ బూ త్ లో ఉన్న పాతపాడు కృష్ణయ్య బనగానపల్లెలో లేనందున వారి ఆరోగ్య నిమిత్తం నంద్యాల హాస్పిటల్ నందు కంటి ఆపరేషన్ చేయించుకుని బనగానపల్లెకు రాలేనని చెప్పగా వారి వద్దకే వెళ్లి నంద్యాలలో ఇంట్లో ఉండగా పెన్షన్ డబ్బులు 7000/- ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గ ముస్లిం మైనార్టీ టిడిపి సెల్ అధ్యక్షులు రాయలసీమ సలామ్ మరియు విఆర్వోలు ఈశ్వర్ రెడ్డి మరియు వీఆర్వో మహానంది నంద్యాల కి వెళ్లి వారి పెన్షన్ డబ్బులు ఇవ్వడం జరిగింది. దీంతో పాతపాడు కృష్ణయ్య మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాగ్‌లు, బూట్లు మంజూరు

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలానికి స్టూడెంట్ కిట్ల కింద విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, డిక్షనరీలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంఈఓ వీర ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బ్యాగులు 2077, బూట్లు 2077, ఆరవ తరగతి విద్యార్మలకు 167 డిక్షనరీలు వచ్చాయన్నారు. అలాగే నాలుగో విడతగా 2,268 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ఇప్పటివరకు 18,381 పాఠ్యపుస్తకాలు మండల స్టాక్ పాయింట్ కు చేరగా వాటిని ఆయా పాఠశాల హెచ్ఎంల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. స్టూడెంట్ కిట్ లో భాగంగా యూనిఫామ్ దుస్తులు, పాఠ్యపుస్తకాలు పదవ తరగతి పి సైన్స్ తో పాటు ఇతర రకాలు 3,200 రావాల్సి ఉన్నాయని ఎంఈఓ పేర్కొన్నారు.

డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రజలు డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి తస్లీమా సుల్తానా అన్నారు. గురువారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో డెంగ్యూ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వర్షాకాలంలో డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ మనోహర్, ఎంల్‌హెచ్‌వి కవిత, ఆరోగ్య కార్యకర్త భూదేవి,ఆశ కార్యకర్తలు రజని, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా అల్లూరి సీతరామరాజు జయంతి

విశాలాంధ్ర - చాగలమర్రి : మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాగల మర్రి పట్టణంలోని బిసి సంఘ కార్యాలయంలో నంద్యాల జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సల్లా మాట్లాడుతూ విప్లవవీరుడు అల్లూరి సీతా రామరాజు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ముందుండి ఉద్యమాలు నిర్వహించారన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనుల హక్కుల కోసం ఉద్యమించి, దేశంకోసం ప్రాణాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో గుత్తి నరసింహుడు, సుధాకర్ రెడ్డి, ట్రైలర్ చోటు, అబ్దుల్లా, రామతీర్థం, పీరయ్య, హుస్సేనయ్య, ట్రైలర్ భాష, కసినేని ఓబులేసు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆత్మకూర్ రూరల్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ప్రధానోపాధ్యాయుడు రఘు రామాచార్యులు ఆధ్వర్యం లో స్వతంత్ర సమర యోధుడు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుక లు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1887 జులై 4వ తేదీన విజయనగరంలోని పాండ్రంగిలో జన్మించారు ఆయన భారత స్వతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహా జ్వల శక్తి ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యయనం అన్నారు. అగ్గి వీరుడు మన్యం విప్లవ వీరుడు తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన వీర కిశోరం అల్లూరి సీతారామరాజు అంటూ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. అధ్యాపకులు, అధ్యాపకురాలు తపాల్గొన్నారు.

మహానందీశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర - మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో గురువారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఈఓ శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారిమెమొంటో అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పు చేసిన ఏ ఒక్కరు తప్పించుకోలేరన్నారు శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అభివృద్ధి అనేది మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తామని, ప్రతి గ్రామం లోని సమస్య తో పాటు, నియోజక వర్గ పరిధిలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలు శ్రీశైలం, మహానంది సమస్యల పరిష్కారం కూడా సత్వరమే చేస్తామని అటవీ అధికారుల సమన్వయంతో మన్య మృగాల బెడద కూడా గ్రామ ప్రజలకు లేకుండా చేస్తామన్నారు. శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు బుడ్డారెడ్డి యశస్విని, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఆలయ ఏఈఓ లు, ఓ వెంకటేశ్వర్లు, మధు, మహానంది మండల టిడిపి నాయకులు, ఉల్లి మధు, సరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, మాజి ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున మాజి మండల అధ్యక్షులు బసిరెడ్డి నాగ భూపాల్ రెడ్డి జనార్దన్ రెడ్డి,రవిస్వామి సరేపల్లె శ్రీను అస్లాం భాష, టిడిపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే జీవో నెం.117ను రద్దు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రభుత్వ ప్రాథమిక విద్య ను సర్వనాశనం చేస్తున్న జీవో నెం.117ను వెంటనే సత్వరమే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గూడూరు మండలంలోని బూడిదపాడు, నాగలాపురం, పెంచికల పాడు, గుడిపాడు, మునగాల, చనుగొండ్ల గ్రామంలోని ఉన్నత, ప్రాథమికోన్నత ,ప్రాథమిక పాఠశాలలో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమము చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నెం.117ను రద్దుచేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తామని ప్రస్తుత మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నెర వేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడు గులు వేయాలని, దానికి అనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాత పద్ధతిలో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ, కన్నడ మాధ్య మాలను కొనసాగించాలన్నారు. అప్రెంటిస్ విధానం లేకుండా మెగా డీఎస్సీలో నియామకాలు చేపట్టాలని కోరారు. పిఆర్‌సి అమలు ఆలస్యమవుతున్నందున 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి, అవసరం లేని యాప్లను రద్దు చేయాలని, కేజీబివి ఉపాధ్యాయులకు ఎంటిఎస్ వర్తింప చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సుబ్బ రాయుడు, ప్రభాకర్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయ్యన్న, అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా నేరెళ్ల రవితేజ నియామకం

విశాలాంధ్ర - చాగలమర్రి : ఆళ్లగడ్డనియోజకవర్గంలోని చాగలమర్రి కి చెందిన నేరెళ్ల ఎస్వీ రవితేజ హైకోర్టు ఏజిపిగా నియమితులయ్యారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రికి చెందిన సీనియర్ న్యాయవాది నేరెళ్ల చంద్రశేఖర్ కుమారుడు నేరెళ్ల ఎస్వీ రవితేజను హైకోర్టు ఏజీపీగా నియమించడం పట్లఆళ్లగడ్డ, నంద్యాలచెందిన న్యాయవాదులే కాక కోర్టు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా హైకోర్టు ఏజీపీగా నియమితులైన ఎస్వీ రవితేజ ప్రాథమిక విద్య చాగలమర్రి లోను, ఉన్నత పాఠశాల విద్య కర్నూలు మాంటిసోరి పాఠశాలలోను, ఇంటర్మీడియట్ హైదరాబాదు నారాయణ కాలేజీ లోను, న్యాయవాద పట్టా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో, ఎల్ ఎల్ ఎం (రాజ్యాంగం) ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇతర పీజీ కోర్సులు నల్సార్ లో పూర్తి చేశారు. కాగా 2015 సెప్టెంబర్ 10వ తేదీన బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. హైదరాబాదు ట్రయల్ కోర్టులలో, హైకోర్టో ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా నేరెళ్ల ఎస్వీ రవితేజ ప్రతిభను గుర్తించి హైకోర్టు ఏజీ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వీరిని ఏజీపీగా నియమించారు. దీంతో నేరెళ్ల ఎస్వీ రవితేజ కుటుంబసభ్యలలో ఆనందం వ్యక్తం అవుతోంది. కాగా రవితేజ తండ్రి నేరెళ్ల చంద్రశేఖర్ ఆళ్లగడ్డ కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. రవితేజ అబ్బ(తండ్రికి తండ్రి) నేరెళ్ల యదార్థుడు స్వాతంత్ర సమరయోధులు. సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజు లో కర్నూలు జిల్లా నుంచి మొదట చేరిన దేశభక్తుడు. ఈ కుటుంబాన్ని నేపథ్యం కలిగిన నేరెళ్ల ఎస్వీ రవితేజ ఏజీపీగా నియమితులు కావడం కోర్టు న్యాయవాదులు కోర్టు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఏజీపీగా నియమితులైన నేరెళ్ల ఎస్వీ రవితేజ తండ్రి నేరెళ్ల చంద్రశేఖర్ ను అభినందించారు. తండ్రికి తగ్గ తనయుడిగా పలువురు హర్షంవ్యక్తం చేశారు.

వంద శాతం గర్భిణీ స్త్రీలను రిజిస్ట్రేషన్ చేయాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పిల్లల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.రంజిత్ బాష తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య, ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జిల్లాలో ఉన్న పిహెచ్సిలు, హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, టిబి రోగులకు అందిస్తున్న ట్రీట్మెంట్, లెప్రసీ, హెచ్ఐవి, మలేరియా, ఆర్బీఎస్కే, పిఎంఎంవివై, అంధత్వ నివారణ కార్యక్రమాలు, ఆరోగ్యశ్రీ తదితర కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తాను బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఒక యాప్ ను రూపొందించి అమలు చేశామని, అదే విధంగా ఇక్కడ యాప్‌ను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఈ యాప్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు లాగిన్ అయి పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే విధంగా ఉంటుందన్నారు. అన్ని శాఖలు కలిసి హీమోగ్లోబిన్ శాతం, న్యూట్రిషన్,ఇతర ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ, తదనంతర చర్యలు తీసుకునే విధంగా యాప్ ఉంటుందన్నారు.. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే తెప్పించి కర్నూలు జిల్లాకు అనుగుణంగా రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అతిసార, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. వ్యాధుల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలను గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీబీ రోగులకు స్క్రీనింగ్ చేస్తున్నారా, ఎంతమంది రోగులు ఉన్నారంటూ కలెక్టర్ ఆరా తీశారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డా.ప్రవీణ్ కుమార్, డిసిహెచ్ఎస్ డా.మాధవి, జిల్లా లెప్రసీ ప్రాజెక్టు ఆఫీసర్, డా.భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, జిల్లా కోఆర్డినేటర్ హేమలత, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మానిటరింగ్ ఆఫీసర్, డా.ఉమ, జిల్లా సర్వేలెన్స్ ఆఫీసర్ డా.నాగప్రసాద్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, డా.సంధ్య పాల్గొన్నారు.